క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను కలిసిన ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ఘన్‌పూర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను..



జనగామ: ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధిలో ఆదివారం జరిగిన మల్లన్న కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని జనగామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, మాజీద్, మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, బనుక శివరాజ్ యాదవ్, నల్లగోని బాలకిషన్‌గౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యే వీరేశాన్ని..



దేవరుప్పుల: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను తెలంగాణ సాధన ఉద్యమకారులు ఆదివారం నకిరేకల్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజాపోరాటాల వామపక్ష భావజాల రాజకీయాల్లో రాణించిన వీరేశంకు చట్ట సభల్లో రెండోసారి ప్రజలు అవకాశం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. యాకన్న, అంజనేయులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



బచ్చన్నపేట: కొన్నె సర్పంచ్ వేముల వెంకట్ గౌడ్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో చేర్యాల పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కొన్నె సర్పంచ్ వెంకట్‌తో పాటు మాజీ సర్పంచ్ చెవిటి ఆనందం కూడా చేరారు. నాయకులు జంగిటి విద్యానాథ్, నూకల బాల్‌రెడ్డి, నిడిగొండ శ్రీనివాస్, జంగిటి నరేష్, సందెల రాము, బందారం క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రేపు సిద్ధేశ్వరాలయ హుండీ లెక్కింపు

బచ్చన్నపేట: ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన కొడవటూర్ సిద్ధేశ్వరాలయ హుండీని రేపు (మంగళవారం) లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ హుండీ లెక్కింపునకు దేవాదాయ శాఖ అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలు హాజరవుతున్నారని అలాగే పలు శాఖల అధికారులు కూడా వస్తున్నట్లు చెప్పారు. భక్తుల కోరిన కోర్కెలను తీర్చే మహాశివుడి ఆలయం చాలా పవిత్రమైనదని, ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు సహకరించాలని కోరారు. ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నపెండ్యాల కురుమసంఘం కమిటీ ఎన్నిక

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం కులపెద్దలు కొన్నె వెంకటయ్య, బెల్లం మహేష్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటి మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా దూడల కుమార్, కార్యదర్శిగా బుల్లె రాజయ్య, కోశాధికారిగా కొన్నె లింగయ్య, కార్యవర్గ సభ్యులుగా దూడల చిన్న ఐలయ్య, కొన్నె బాలకొమురయ్య, మీసా కొమురయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల సంఘం అధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు



లింగాలఘణపురం: ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుహాసిని



దేవరుప్పలలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీపీఓ రంగాచారి



బచ్చన్నపేట: ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న మండల స్పెషలాఫీసర్లు

లింగాలఘణపురం: జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు కొనసాగుతోంది. అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ సుహాసిని ఆదేశించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు బాగానే చేస్తున్నారని, మరింత వేగవంతం చేసి సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని చెప్పారు. తహసీల్దార్ విన యలత, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ మల్లికార్జున్ ఉన్నారు.

దరఖాస్తుల ఎంట్రీకి చర్యలు

దేవరుప్పుల: వారం రోజులపాటు గ్రామాల్లో స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు యుద్ధప్రాతిపదికన డాటా ఎంట్రీ కోసం అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి, ప్రజాపాలన పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాచారి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిషత్‌లో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశిత కాలంలో దరఖాస్తులను నమోదు చేసి తదుపరి చర్యలకు కార్యాచరణ రూపొందిస్తారన్నారు. అనంతరం దేవరుప్పుల మండల పరిస్థితిపై ఆరా తీయగా ప్రజాపాలనలో మండల వ్యాప్తంగా 13,010 దరఖాస్తులు స్వీకరించగా ఇప్పటికి 4,500 డాటా ఎంట్రీ పూర్తి చేసినట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు కెరాము, హుస్సేన్, ఎంపీడీఓ ఉమామహేశ్వర్, తహసీల్దార్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల ఆన్‌లైన్

బచ్చన్నపేట: ప్రజా పాలనలో మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను ముమ్మరంగా చేస్తున్నామని మండల స్పెషలాఫీసర్లు ఇస్మాయిల్, బాలకృష్ణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో, రచనా మండలి సమాఖ్య భవనంలో దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 13, 500 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. రెండు సెక్టార్లుగా విభజించి 13 గ్రామాల చొప్పున ఆన్‌లైన్ చేయిస్తున్నామని తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కావాలని, కానీ సర్వర్ మొరాయిస్తుండడంతో ఆన్‌లైన్ ఆలస్యం అవుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో రాత్రి వరకు ఆన్‌లైన్ చేయిస్తున్నామని పేర్కొన్నారు. తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న సీఐ రాజు

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యం తాగి ఎవ్వరూ వాహనాలు నడపరాదని ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు హెచ్చరించారు. డివిజన్ కేంద్రంలో పోలీస్‌సిబ్బందితో కలిసి సీఐ ఆదివారం రాత్రి డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనల్ని పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధిత పత్రాలు కలిగి ఉండాలన్నారు. వాహనాల చలాన్లకు ఆఫర్లు వినియోగించుకుని క్లియర్ చేసుకోవాలని ఆయన సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని ఆయన వాహనదారులను హెచ్చరించారు.

నేడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమిపూజ

కొడకండ్ల: హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొర్రూరు మండలం గుర్తూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు సోమవారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి రాజేందర్‌రెడ్డి దంపతులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ మండల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గుర్తూరుకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరండి

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గంలోని గుర్తూరులో పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ జోన్ భూమిపూజ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల ప్రచారంలో యువతకు ఇచ్చిన హామీ మేరకు ఝాన్సీరెడ్డి సొంతంగా ఉపాధి, ఉద్యోగ కల్పనకు దోహదపడే స్కిల్స్‌డెవలప్‌మెంట్‌కు శ్రీకారం చట్టడం హర్షణీయమన్నారు.

'మృదుల కిడ్స్'లో ముగ్గుల పోటీలు

జనగామ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని మృదుల కిడ్స్ స్కూల్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ తడకపల్లి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మన సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెబుతూ మహిళలు, యువతులు ముగ్గులు వేశారు. న్యాయ నిర్ణేతలు అత్యుత్తమ ముగ్గులను ఎంపిక చేశారు. దిమహి(ప్రథమ), శ్రీ ఉద్నన్(ద్వితీయ), రష్మిత(తృతీయ)కు బహుమతులు అందించారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

బాధిత కుటుంబాలకు పరామర్శ



సంపత్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న పల్లా



ఆర్థికసాయం అందజేస్తున్న రాజయ్య

చిల్పూరు: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం హనుమకొండలో వారి నివాసంలో పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చి వారిలో మనోధైర్యం నింపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గౌస్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, నారగోని రవిచంద్ర, తోట రావన్, సందీప్, మధు పాల్గొన్నారు.

చేయూత

మండలకేంద్రానికి చెందిన జగిత్యాల సాంబరాజు ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందగా బాధిత కుటుంబానికి అతడి మిత్రులు తమవంతుగా ఆదివారం రూ.26వేలు ఆర్థిక సాయం చేసి చేయూతను అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిట్టల మహేందర్, మాచర్ల స్వామిగౌడ్, రామోజీచందర్, ఎలిషాల యాదగిరి, పిట్టల సంపత్, మాచర్ల దయాకర్, దామెర ప్రసాద్, దారం లింగయ్య, దారం కోటేశ్వర్, గుర్రాల రాజేంద్రప్రసాద్, దామెర సతీష్, బీమవోని నరేష్,రామకృష్ణ, సీహెచ్. మోహన్‌రెడ్డి, కలకోల రజనీకుమార్ పాల్గొన్నారు.

సర్పంచ్ రూ.30వేలు ఆర్థికసాయం

తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన సాంబరాజు కుటుంబానికి చిల్పూరు సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ తనవంతుగా రూ.30వేలు ఆర్థికసాయం అందించి ఔదార్యాన్ని చాటారు.

అనాథ పిల్లలకు..

నష్కల్‌కు చెందిన అయ్యప్ప మాలధారణ గురుస్వామి ఇమ్మడి లక్ష్మణ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని మల్లికాంబ మనోవికాసకేంద్రం పిల్లలకు ఆదివారం రూ.6,120 నగదును ఆర్థికసాయంగా అందించడం తోపాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు 2023, 2024లో పాదపూజ ద్వారా వచ్చిన వాటిని విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రంజిత్, హరికిషన్, ప్రణయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామశాఖ అధ్యక్షుడి కుటుంబానికి..

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీఆర్‌ఎస్ విశ్వనాథపురం గ్రామశాఖ అధ్యక్షుడు గుర్రపు నర్సింహ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య రూ.40వేలు ఆర్థికసాయాన్ని అందించారు. మండలంలోని విశ్వనాథపురంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ రాజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆర్థికసాయంతో పాటు క్వింటాన్నర బియ్యం అందించారు. రూ.40వేలను మృతుడి కుమార్తెలు ఒక్కొక్కరి పేరిట రూ.20వేలు చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని ఆయన తెలిపారు. జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, సర్పంచ్ అనుమాండ్ల మల్లేశం, నాయకులు ఆకుల కుమార్, మాచర్ల గణేష్, గుండె మల్లేష్, గుర్రం శంకర్, చింత శ్రీను, చిట్టిబాబు, అశోక్, లకావత్ చిరంజీవి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రంగరాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రేషన్‌డీలర్ అయిత వీరేశం తల్లి ద్రాక్షమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మండల మాజీ అధ్యక్షుడు కత్తుల కట్టయ్య, తానేదార్‌పల్లి ఉపసర్పంచ్ మంతెన హరితఇంద్రారెడ్డి, నాయకులు పోలెపల్లి సంపత్‌రెడ్డి, వెంకన్న, లింగారెడ్డి, నర్సయ్య, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

పెద్దబాయితండాలో..

కొడకండ్ల: మండలంలోని పెద్దబాయితండకు చెందిన నునావత్ సక్రీ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆదివారం సేవాలాల్ మహారాజ్ ధర్మపరిరక్షణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహేందర్‌నాయక్ సభ్యులతో కలిసి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.1,000 ఆర్థికసాయం అందజేశారు. సభ్యులు వీరేశ్, శ్రీను, వెంకట్, రాహుల్, నాగరాజు, వెంకట్, సురేష్, నర్సింహ్మ పాల్గొన్నారు.



చిల్పూరు: ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు



కొడకండ్ల: ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఎన్నిక



జనగామ రూరల్: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఆ పార్టీ పెంబర్తి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా బండ్రు సిద్దులును రెండో సారి, యూత్ అధ్యక్షుడిగా భానుచందర్ తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిద్దులు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞత తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు శీలం కొండల్ రెడ్డి, రేపాల కోటేశ్వర్‌రావు, అంబాల సంపత్, సంకటి యాదగిరి వంశీధర్‌రెడ్డి, స్వామి, అంజనేయులు, బుర్రి కరుణాకర్, గోలుసుల దుర్గాచలం, దుర్గేష్, సమ్మయ్య, రామ్, శ్రీకాంత్, భాను, గణేష్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

జనగామ రూరల్: విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా రాణించాలని ఎస్సై శ్వేత అన్నారు. ఆదివారం పట్టణంలోని వైష్ణవి స్కూల్‌లో డిస్ట్రిక్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హాజరై విజేతకు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పని సరిగా తైక్వాండో నేర్చుకోవాలని అన్నారు. తైక్వాండోతో ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జాక్ నాయకుడు మంగళంపల్లి రాజు, చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్సై శ్వేత

ఇంటింటా రాములోరి అక్షింతల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీగా వెళ్తున్న రామభక్తులు



దేవరుప్పుల కొత్తకాలనీలో..

స్టేషన్‌ఘన్‌పూర్: పవిత్ర అయోధ్య శ్రీరామ జన్మభూమి పూజిత అక్షింతలు ఆదివారం ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లికి చేరుకున్నాయి. స్థానిక లక్ష్మీవేంకటేశ్వర ఆలయం నుంచి వివేకానంద చౌరస్తా మీదుగా శివునిపల్లిలో వాడవాడలా రామభక్తులు డప్పు చప్పుళ్లతో ర్యాలీ చేపట్టారు. రామ భక్తులు అధిక సంఖ్యలో హాజరై అక్షింతలు మోశారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ గడపగడపకు పవిత్ర అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. వాడవాడలా మహిళలు మంగళహారతులతో ఎదురేగి భక్తిశ్రద్ధలతో అక్షింతలను తీసుకుని పూజగదుల్లో భద్రపర్చుకున్నారు. కార్యక్రమంలో వీటీ శ్రీనివాస్, నాగబండి వెంకట్రాంనర్సయ్య, పార్శి రంగరావు, రడపాక ప్రదీప్, వనం సారంగపాణి, అంబటి హేమంత్‌రాజ్, కె.శరత్‌కుమార్, శాగ సురేష్, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: అయోధ్య మందిర పునఃప్రారంభోత్సవం పురస్కరించుకొని చేపట్టిన పూజతో కూడిన అక్షింతలను రాజకీయాలకతీతంగా హిందూ ధార్మికత్వంతో ఇంటింటా వితరణ చేశారు. ఆదివారం మండల కేంద్రం కొత్తవాడలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు కొత్తవాడలోని హనుమాన్‌ఆలయంలో తొలుత ప్రత్యేక పూజ చేసి రామ నామస్మరణంతో ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి పెద్దాపురం వెంకటేశ్వశర్మ, తోటకూరి పాండుకృష్ణ, పులిగిల్ల యాకయ్య, ఎల్లయ్య, జక్కుల గంగరాజు, ఉప సర్పంచ్ తోటకూరి దశరథ నీలారపు చిన్నవెంకన్న, అలకుంట్ల మహేష్ , తోటకురి మహంకాళి, సోమిరెడ్డి,సోమయ్య, నర్సయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో అయోధ్య రాముడి అక్షింతలతో భక్తులు, గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షింతలను ఇంటింటా పంపిణీ చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు శిరభోయిన సంధ్య శ్రీనివాస్, నెల్లుట అజయ్‌కుమార్, ఈగ కష్ణమూర్తి, గడ్డం యాకయ్యతో పాటు భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బచ్చన్నపేట: అందరూ రామనామంను స్మరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కామిడి రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కట్కూర్, మన్‌సాన్‌పల్లి, కొన్నెలో అయోధ్య అక్షింతలను పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటా ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, రామ భక్తులు గీస సందీప్, కోడూరి శివకుమార్, మహంకాళి శివకుమార్, నల్లనాగుల వెంకటాచారి, మూసిని వేణు, రాజు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండల కేంద్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో అయోధ్య రాముడి అక్షింతల వితరణ చేపట్టారు. రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన అక్షింతలను స్థానిక హనుమాన్ ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీరాముడి చిత్ర పటాన్ని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అయోధ్య అక్షింతలు అందజేశారు. పడకంటి రవీందర్, బీజేపీ మండల అధ్యక్షుడు వల్లాల వెంకటేష్‌యాదవ్, వల్లాల మధు, వెంకటేశ్వర్లు, రాజు,శ్రీకాంత్, రాజేష్, ముకేష్, మల్లేష్, కృష్ణ, కిషన్‌జీ, జంపయ్య, ఉప్పలయ్య, సమ్మయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: అయోధ్య అక్షింతలతో భక్తులు, గ్రామస్తులు



బచ్చన్నపేట: కట్కూర్‌లో..

జాతర ప్రాంగణం పరిశీలన



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణాన్ని వైస్ ఎంపీపీ, జాతర కమిటీ గౌరవ అధ్యక్షుడు చల్లా సుధీర్‌రెడ్డి, జాతర కమిటీ చైర్మన్ కోరుకొప్పుల మహేందర్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. జాతర నిర్వహణ కోసం చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. జాతర స్థలంలో వ్యవసాయభూములు ఉన్న వారితో జాతర నిర్వహణ విషయమై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటికొండ సమ్మక్క–సారలమ్మ జాతరను ప్రతీసారి మాదిరిగానే ఘనంగా నిర్వహించేలా అన్ని పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో సంబంధిత పనులు ప్రారంభిస్తామని, జాతర విజయవంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. జిట్టెగూడెం ఉపసర్పంచ్ రవీందర్, జయపాల్‌నాయక్, శ్రీను, కట్టమల్లు, రవీందర్, వసంత్, బాబురావు, రాజు పాల్గొన్నారు.

లింగంపల్లి జాతర చైర్మన్ పదవికి పోటాపోటీ

చిల్పూరు: మండలంలోని లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతరకు చైర్మన్ పదవి కోసం పోటాపోటీ మొదలయింది. ఇప్పటి వరకు చైర్మన్‌పదవి ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి వర్తింపజేస్తున్నారు. ఫిబ్రవరి 21 నుంచి నిర్వహించే జాతరకు గ్రామానికి చెందిన రావులపల్లి చంద్రమౌళి, తుత్తురు రాజు, కండ్లకోలు బాలరాజు, ఊరడి శ్రీనులు చైర్మన్ పదవికి పోటీపడుతున్నారు. ఎవరికి వారు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరను కలిసి తమకే వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి సారి నిర్వహిస్తున్న జాతర అయినందున పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కోసం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఇన్‌చార్జ్ ఇందిర కోరినట్లు పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్ తెలిపారు.